క్లుప్తంగా

బాధిత కుటుంబానికి రెడ్ క్రాస్ సహకారం



బాధిత కుటుంబానికి సాయం అందజేస్తున్న రెడ్ క్రాస్ సంస్థ ప్రతినిధులు, నాయకులు

ముమ్మిడివరం: ఇటీవల అగ్ని ప్రమాదంలో తాటాకిల్లు దగ్ధమై నిరాశ్రయులైన ముమ్మిడివరం మండలం అన్నంపల్లి శివారు చింతపల్లి లంకకు చెందిన పాలెపు సత్తిబాబు కుటుంబానికి రెడ్ క్రాస్ సంస్థ సహకారం అందించింది. ఇండియన్ రెడ్ క్రాస్ సంస్థ జిల్లా అధ్యక్షుడు కేవీఎస్‌నారాయణ(ఢిల్లీ నారాయణ) ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి టార్పాలిన్, వంట సామగ్రి కిట్, ఐజెనిక్ కిట్, 25 కేజీల బియ్యం మంగళవారం అందించారు. జిల్లా మేనేజింగ్ కమిటీ సభ్యుడు పెయ్యల చిట్టిబాబు, జెడ్పీటీసీ సభ్యుడు కుడిపూడి శంకరరావు, గ్రామ సర్పంచ్ మట్టపర్తి సత్యనారాయణ పాల్గొన్నారు.

ఘనంగా లక్ష్మీనరసింహ స్వామి కల్యాణం

ఐ.పోలవరం: నిత్యకల్యాణం పచ్చతోరణంగా విరాజిల్లుతున్న మురమళ్ల వీరేశ్వరస్వామి ఆలయ క్షేత్రపాలకుడు లక్ష్మీనరసింహస్వామి కల్యాణ మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఐదురోజుల పాటు జరిగే ఈ కల్యాణ మహోత్సవాలు పంచాహ్నిక దీక్షతో పానంగిపల్లి సూర్యనారాయణాచార్యులు, సుదర్శనం దశరథరామానుజాచార్యులు ఆధ్వర్యంలో సోమవారం ప్రారంభం అయ్యాయి. రాత్రి స్వామి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఆలయ చైర్మన్ కొలిశెట్టి గంగబాబు, దాత జంపన రామకృష్ణంరాజు దంపతులు స్వామివారికి పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు అందజేశారు. కల్యాణోత్సవాలు శుక్రవారంతో ముగియనున్నాయి.

విలువలతో కూడిన జీవనమే సన్మార్గం

అమలాపురం టౌన్: నీతి, విలువలతో కూడిన జీవనమే మనిషికి సన్మార్గమని అమలాపురం డివిజన్ శ్రీ సత్య సాయి సేవా సంస్థల కో ఆర్డినేటర్ డాక్టర్ జి.ప్రభాకర్ అన్నారు. స్థానిక సత్య సాయి కల్యాణ మంటపంలో గత నెల 30వ తేదీ నుంచి మే ఆరో తేదీ వరకూ జరుగుతున్న సత్యసాయి బాల వికాస్ ఉచిత శిక్షణ తరగతుల్లో డాక్టర్ ప్రభాకర్ మాట్లాడారు. మంగళవారం ఉదయం జరిగిన మూడో రోజు శిక్షణ తరగుతుల్లో కుటుంబ విలువలు, నీతికథలు అనే అంశంపై ఆయన మాట్లాడారు. రామకృష్ణ మిషన్ నుంచి వచ్చిన అధ్యాపకుడు ఎస్.శ్రీరామచంద్రమూర్తి చిన్నారులకు శిక్షణ ఇస్తూ స్వామి వివేకానంద జీవిత చరిత్ర, ఆ మహనీయుని ఉన్నత భావాలను వివరించారు. బాల వికాస్‌కు చెందిన పిల్లలకు రోజూ పెద్దల పట్ల గౌరవం, కుటుంబ విలువలు, నీతి కథలు, ప్రార్థనా శ్లోకాలు వంటివి నేర్పుతున్నారు. పొదుపు, యోగా, గణితంలో సులభ పద్ధతులతో పాటు రామాయణం – బాలకాండ, భారతదేశం విశిష్టత వంటి అంశాలపై అవగాహన కల్పిస్తున్నారు. ఆరో తేదీ వరకూ జరిగే ఈ శిక్షణ తరగతులకు తల్లిదండ్రులు తమ పిల్లలను పంపించి వారిలో విలువలపై అవగాహన పెంచే ప్రయత్నం చేయాలని డాక్టర్ ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు.

త్వరలో కానిస్టేబుల్ ఉద్యోగాలకు రాత పరీక్ష

యానాం: పోలీస్ కానిస్టేబుల్స్ రిక్రూట్‌మెంట్‌కు సంబంధించి ఇప్పటికే ఫిజికల్ ఫిట్‌నెస్ పరీక్ష పాస్ అయినవారికి త్వరలో రాతపరీక్ష నిర్వహించనున్నట్లు హోంమంత్రి నమశ్శివాయ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కానిస్టేబుల్ పోస్టుల భర్తీ అనంతరం 500 మంది హోమ్‌గార్డులను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ట్రాఫిక్ పోలీస్‌శాఖలో సైతం కొన్ని ఖాళీలు ఉన్నాయన్నారు. ఇప్పటికే 390 కానిస్టేబుల్ పోస్టులను భర్తీ చేశామని వారంతా శిక్షణలో ఉన్నారన్నారు. జూన్ 1నుంచి పాఠశాలలు తెరిచేలోపు విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు, యూనిఫామ్‌లు సమకూర్చనున్నట్లు తెలిపారు. ఆన్‌లైన్ గ్లాంబ్లింగ్ నిషేధానికి సంబంధించిన డ్రాఫ్ట్ బిల్లును కేంద్రహోంశాఖ ఆమోదానికి పంపినట్లు చెప్పారు. నాలుగు రీజియన్‌లలోను పోలీస్ ఆఫీసర్లకు రెండవ దశలో రూ.3కోట్లుతో మరో 33 వాహనాలు కొనుగోలు చేస్తామన్నారు.

రాజ్యాంగమే ప్రజలకు రక్ష

ముమ్మిడివరం: భారత రాజ్యాంగమే ప్రజలకు రక్షణ అని..అన్ని వర్గాల ప్రజలకు, ముఖ్యంగా స్త్రీలకు పురుషులతో సమానంగా హక్కులు కల్పించిన మేధావి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని ఆర్‌పీఐ రాష్ట్ర నాయకులు పెనుమాల సుధీర్ అన్నారు. కొత్తలంక హైస్కూలు ప్రాంగణంలో మంగళవారం జరిగిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 132వ జయంతిని ఐదు గ్రామ పంచాయతీల ప్రజలు ఐక్యంగా నిర్వహించారు. ఊరేగింపు నిర్వహించి అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. తొలుత మోర్త మురళి ఆర్థిక సాయంతో నిర్వహించిన క్రికెట్ పోటీలలో విజేతలకు ఉద్యమ నాయకులు చేతుల మీదుగా అందజేశారు. న్యాయవాది దాసరి సత్యనారాయణ, కమిటీ అధ్యక్షుడు కాశి జగపతిరావు, సర్పంచ్‌లు కాశి భాగ్యలక్ష్మి, విత్తనాల నాగ బ్రహ్మేశ్వరరావు, పీటీవీ వర్మ పాల్గొన్నారు.

వంటింటికే నేరుగా గ్యాస్

- పేరూరులో పైలట్ ప్రాజెక్టు సక్సెస్
- బోడసకుర్రు, అమలాపురం, రాజోలు ప్రాంతాలకు విస్తరణ

అల్లవరం: మహానగరాలకే పరిమితమైన పైప్‌లైన్ ద్వారా వంట గ్యాస్ సరఫరా నేడు పల్లెలకు విస్తరిస్తోంది. ఓఎన్‌జీసీ, గెయిల్ సంస్థలు చమురు నిక్షేపాలు వెలికితీస్తున్న ప్రాంతాల్లోని ప్రజలకు ఇంటింటికీ వంట గ్యాస్ సరఫరా చేసేందుకు 2019లో పైలట్ ప్రాజెక్టుగా బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో పేరూరు గ్రామాన్ని ఎంపిక చేశారు. కృష్ణా గోదావరి బేసిన్‌లో లభ్యమవుతున్న గ్యాస్ నిల్వలను స్టోర్ చేసి, అక్కడ నుంచి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పైపులైన్ ద్వారా వంట గ్యాస్ సరఫరా చేస్తున్నారు.

బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో గెయిల్, ఏపీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ హెచ్‌పీసీఎల్, గోదావరి గ్యాస్ ప్రైవేటు లిమిటెడ్ సంస్థలు సంయుక్తంగా జిల్లాలోని అమలాపురం రూరల్ పరిధిలో పేరూరు, అమలాపురం టౌన్, అల్లవరం మండలంలో బోడసకుర్రు, రాజోలు టౌన్ ప్రాంతాల్లో వంట గ్యాస్ పైపులైన్ పనులు నిర్వహిస్తున్నాయి.

వేగంగా పైపులైన్ పనులు

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పేరూరు గ్రామాన్ని పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారు. ఈ ప్రాజెక్టు సక్సెస్ కావడంతో కోనసీమ జిల్లాలో అమలాపురం టౌన్, అల్లవరం మండలంలో బోడసకుర్రు, రాజోలులో విస్తరించారు. పేరూరులో 1,000 గృహాలకు పైప్‌లైన్ ద్వారా వంటగ్యాస్‌ను సరఫరా చేస్తున్నారు. బోడసకుర్రు గ్రామంలో 1,000 ఇళ్లకు పైపులైన్ ఏర్పాటు చేసి 600 ఇళ్లకు గ్యాస్ సరఫరా చేస్తున్నారు. మరో 400 వందల ఇళ్లకి పైపులైన్ అనుసంధాన పనులు నిర్వహిస్తున్నారు. త్వరలో వీరికి కనెక్షన్లు ఇవ్వనున్నారు.



పేరూరులో పీఎన్‌జీ గ్యాస్ ప్లాంట్



బోడసకుర్రులో ఓ ఇంటికి అమర్చిన గ్యాస్ రీడింగ్ మీటరు



పైపులైన్ ద్వారా సరఫరా చేస్తున్న గ్యాస్‌తో వంట చేస్తున్న గృహిణి

అమలాపురం టౌన్‌లో 10 వేల కనెక్షన్లు లక్ష్యం కాగా ఇప్పటి వరకు 2 వేలు ఇళ్లకు గ్యాస్ సరఫరా సాగుతోంది. మిగిలిన ఇళ్లకు పైపులైన్ పనులను చేపట్టారు.

అల్లవరం మండలం గూడాలలోని గ్యాస్ కనెక్షన్ నుంచి పైపులైన్ ద్వారా పేరూరులోని పీఎన్‌జీ గ్యాస్ ప్లాంట్‌కు సరఫరా చేసి అక్కడ గ్యాస్‌ను స్టోర్ చేస్తున్నారు. అక్కడ నుంచి పైపులైన్ ద్వారా ఇళ్లల్లో ఏర్పాటు చేసిన గ్యాస్ పొయ్యిలకు అనుసంధానం చేసిన పైపుల ద్వారా వంట గ్యాస్ సరఫరా చేస్తున్నారు. గ్యాస్ వినియోగదారుల ఇళ్లలో పైపులైన్, మీటర్లు ఏర్పాటు చేసి గ్యాస్ వినియోగాన్ని బట్టి బిల్లులు చెల్లించాలని గోదావరి గ్యాస్ ప్రైవేటు లిమిటెడ్ అధికారి తెలిపారు. కేజీ గ్యాస్‌కి రూ.50 చొప్పున వినియోగదారుల నుంచి వసూలు చేస్తున్నామని, నెలలో గ్యాస్ వినియోగాన్ని బట్టి బిల్లు చెల్లించవలసి ఉందని తెలిపారు. గ్యాస్ పైపులైన్ ఏర్పాటు చేసిన ప్రాంతాల్లో ఇళ్లు, రోడ్ల నిర్మించే సమయంలో పైపులైన్‌కి నష్టం జరగకుండా అప్రమత్తం చేస్తున్నట్టు ఆయన తెలిపారు. వినియోగదారుల సమస్యలపై 24 మంది సిబ్బంది మూడు షిప్టుల్లో పనిచేస్తున్నట్టు చెప్పారు.

సురక్షితంగా భావిస్తున్నాం



ప్రతి నెలా గ్యాస్ అయిన వెంటనే కస్టమర్ కేర్‌కి ఫోన్ చేసి సిలిండర్‌ని బుక్ చేసుకునే అవస్థ లేకుండా పైపులైన్ ద్వారా 24 గంటల పాటు గ్యాస్ సరాఫరా చేస్తున్నారు. ఇంటికి ఏర్పాటు చేసిన మీటర్ ద్వారా గ్యాస్ వినియోగానికి నెల వారీ బిల్లు వసూలు చేస్తున్నారు. పైపులైన్ ద్వారా వంట గ్యాస్ సరఫరా సురక్షితంగా భావిస్తున్నాం.

– మట్టపర్తి లీలాశ్రీ, గృహిణి, బోడసకుర్రుపాలెం

సచివాలయాన్ని సందర్శించిన డీఎంఅండ్‌హెచ్‌వో



రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారి దుర్గారావు దొర

అమలాపురం రూరల్: జిల్లా వైద్యాధికారి కె.దుర్గారావు దొర పేరూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో కామనగరువు సచివాలయాన్ని ఆకస్మికంగా సందర్శించి గర్భిణులకు, బాలింతలకు, కిషోర్ బాలికలకు రక్తహీనత కోసం చేస్తున్న వైద్య పరీక్షల రికార్డులను పరిశీలించి సిబ్బందికి పలు ఆదేశాలను ఇచ్చారు. సక్రమంగా పరీక్షలు నిర్వహించి ఐరన్ మాత్రలు పంపిణీ చేయాలని ఆదేశించారు. వైద్యాధికారిణి ములపర్తి శాంతిలక్ష్మి, ఎంపీహెచ్‌ఓ రామకృష్ణ, సూపర్‌వైజర్ కామేశ్వరరావు పాల్గొన్నారు.

ఇంటర్‌లో ప్రతిభ కనబర్చిన విద్యార్థికి సత్కారం



శర్మను సత్కరించిన ఆర్ఏఓ మునిస్వామి

యానాం: ద్వితీయ సంవత్సరం ఇంటర్మీడియెట్ పరీక్షా ఫలితాల్లో మెరుగైన ప్రతిభ కనబర్చిన యానాం పట్టణానికి చెందిన విద్యార్థి కేవీఎస్ఎస్ శర్మను ఆర్ఏఓ మునిస్వామి తన చాంబర్‌లో సత్కరించారు. ద్వితీయ సంవత్సరంలో శర్మకు 1,000కి గాను 981మార్కులు సాధించాడని తెలిపారు.

వరి పంట నష్టపోకుండా చర్యలు

ముమ్మిడివరం: ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు వరి చేలల్లో ఉన్న పనలు, కళ్లాల్లో ఉన్న పంట దిగుబడులు దెబ్బ తినే అవకాశం ఉన్నందున రైతులు తక్షణ చర్యలు చేపట్టాలని ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త బి.భవానీ సూచనలిచ్చారు. గింజ గట్టి పడే దశ నుంచి కోత దశలో చేలు పడిపోకుండా ఉండి నిద్రావస్థ కలిగిన వరి రకాలలో నష్టం తక్కువగా ఉంటుందన్నారు. నిద్రావస్థ లేని రకాలు నీట మునిగితే వరి కంకులు మొలక వచ్చే అవకాశ ముందన్నారు. నిద్రావస్థ కలిగిన రకాలలో కూడా చేలు పడిపోయి ఎక్కువ రోజులు నీట మునిగితే గింజలలో నిద్రావస్థ కలిగి అవి మొలకెత్తే అవకాశం ఉందన్నారు. కోసిన వరి పొలాలు వర్షాలకు తడిస్తే అవి మొలకెత్త కుండా ఉండటానికి ఐదు శాతం ఉప్పు ద్రావణాన్ని పిచికారీ చేసి వర్షాలు తగ్గిన తరువాత పనలను తిరగ వేసి వాటిని ఎండబెట్టి నూర్చుకోవాలన్నారు. పొలంలో నీరు నిలబడి ఉంటే పనలను గట్లపైకి తెచ్చి ఉప్పు ద్రావణాన్ని పిచికారీ చేసుకోవాలని సూచించారు. వరి కుప్పలు వేసే సమయంలో పనలు తడిస్తే ఎకరానికి 25 కిలోలు ఉప్పును పనలపై చల్లుకోవాలన్నారు. నూర్చిన ధాన్యం రెండు మూడు రోజులు ఎండ బెట్టడానికి వీలు లేకపోతే క్వింటాలు ధాన్యానికి ఒక కిలో ఉప్పు, 20కిలోల పొడి ఊక కలిపి ధాన్యం పోగు పెట్టడం వల్ల అవి మొలకెత్తకుండా, రంగు మారకుండా ఉంటాయన్నారు. పూర్తిగా తడిసి రంగు మారిపోయిన ధాన్యానికి మార్కెట్లో ధర సరిగా రాదన్నారు. అటువంటి ధాన్యాన్ని ఉప్పుడు బియ్యంగా అమ్ముకోవడం వల్ల నష్టాన్ని కొంత వరకు తగ్గించుకోవచ్చునని సూచించారు.

రైతన్నను ముంచిన అకాల వర్షాలు

కాట్రేనికోన: అకాల వర్షాలు నట్టేట ముంచాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అకాల వర్షాలకు వరి పంట దెబ్బతిని, పెట్టుబడులు రాని పరిస్థితిలో రైతులు ఉన్నారు. కోత కోసిన వరి పనలు వర్షపు నీటితో మొలకలు వచ్చాయని, రాసులపైన, కళ్లాల్లో ఉన్న ధాన్యం తడిసి ముద్దకావడంతో కొనేవాళ్లు లేరని రైతులు గగ్గోలు పెడుతున్నారు. మండలంలో వేట్లపాలెం, కాట్రేనికోన, తిమ్మాపురం, దొంతికుర్రు, కొప్పిగుంట, నడవపల్లి, కుండలేశ్వరం, కందికుప్ప, పల్లంకుర్రు గ్రామాలలో ఈదురు గాలులకు వరి చేలు చేలకు ఒరిగి పోయాయి. పనలపై ఉన్న ధాన్యం మొలకలు వచ్చింది. అధికారులు స్పందించి నిబంధనలు సడలించి మద్దతు ధరలపై ధాన్యం కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.



కాట్రేనికోన శివారు వేట్లపాలెంలో ఆరబోసిన ధాన్యం

ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం

ఉప్పలగుప్తం: జగనన్నే మాభవిష్యత్తు కార్యక్రమానికి విశేష స్పందన లభించినందుకు విలసవిల్లి సర్పంచ్ సలాది ఊర్మిళాదేవి, గ్రామ కమిటీ అధ్యక్షుడు సతీష్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి మంగళవారం క్షీరాభిషేకం నిర్వహించారు. మండలంలోని విలసవిల్లి పంచాయతీ కార్యాలయంలో సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్ల సమక్షంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఊర్మిళాదేవి మాట్లాడుతూ సీఎం జగన్ ఆదేశాలతో నిర్వహించిన కార్యక్రమానికి తమ గ్రామంలో విశేష స్పందన లభించిందని అన్నారు. మండల వ్యాప్తంగా విలసవిల్లి గ్రామంలో ఈ కార్యక్రమం పూర్తిస్థాయిలో చేయడంతో ముందంజలో ఉన్నామన్నారు. జగనన్న అందించిన సంక్షేమ పథకాలు పార్టీలకు అతీతంగా ప్రజలకు అందటంతో కార్యక్రమాన్ని విజయవంతం చేయగలిగామన్నారు. సతీష్ మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా జగనన్న ప్రభుత్వం పనిచేస్తోందని, మళ్లీ జగనన్న ముఖ్యమంత్రి అయ్యేలా అంతా కృషి చేయాలని కోరారు. సచివాలయ కన్వీనర్లు కోలా ఏసు, బీర నరసింహమూర్తి, దాసరి భద్రావతి పాల్గొన్నారు.



ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న సర్పంచ్ ఊర్మిళాదేవి

వర్షపు నీరు దిగే మార్గం చూపాలని వినతి

ఉప్పలగుప్తం: మండలంలోని చల్లపల్లి గ్రామం పోతురాజు గుడి వీధిలో వర్షాలకు నీరు పోటెత్తుతుండడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని సమస్యకు పరిష్కారం చూపాలని గ్రామానికి చెందిన మహిళలు ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం వినతి పత్రాన్ని అందించారు. చిన్నపాటి వర్షాలకు నీరు ఎటూ వెళ్లే అవకాశం లేక రోజులు తరబడి నిలిచిపోతోందని, దానితో పరిసర ప్రాంతాల్లో నివసిస్తున్న వారికి దోమలు పెరిగి రోగాల బారిన పడుతున్నామన్నారు. స్కూల్ పిల్లలు సైతం పాఠశాలకు వెళ్లే క్రమంలో ఈ వర్షపు నీటితో ఇబ్బందులు పడుతున్నారన్నారని తెలిపారు. గతంలో ఉన్న రోడ్డు బాగా పల్లం అయిపోవటంతో నీరు ప్రవహించటానికి ఆటంకంగా ఉందని ఫిర్యాదులో తెలిపారు. సుమారు 50 కుటుంబాల వరకు ఈ ప్రాంతంలో నివసిస్తున్నాయని వెంటనే అధికారులు స్పందించి రోడ్డు, డ్రైనేజీ వ్యవస్థలను ఏర్పాటు చేయాలని తెలిపారు. ఆకుల నాగపూజ భవాని, నెయ్యేశ్వరి, షేక్ నూర్జహాన్, సుంకర వరలక్ష్మి, ఎం.రామలక్ష్మి, పి.మంగతాయారు ఫిర్యాదు అందించిన వారిలో ఉన్నారు.



ఎంపీడీవో కార్యాలయంలో వినతి పత్రం అందిస్తున్న మహిళలు

10లోపు ఈకేవైసీ పూర్తి చేసుకోవాలి

అమలాపురం టౌన్: రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లు ఈ నెల 10వ తేదీలోపు ఈకేవైసీ పూర్తి చేసుకోవాలని, ప్రతి పెన్షన్‌దారుడు ఇది అత్యవసరంగా భావించి ఈ ప్రక్రియ చేపట్టాలని అమలాపురం సబ్ డివిజనల్ సబ్ ట్రెజరీ అధికారి రంగారావు విజ్ఞప్తి చేశారు. జిల్లా స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.సాయి వరప్రసాద్, ప్రధాన కార్యదర్శి కేకేవీ నాయుడుతో కూడిన పెన్షనర్ల బృందం అమలాపురం ట్రెజరీ కార్యాలయానికి మంగళవారం వెళ్లి అధికారి రంగారావుతో పలు అంశాలపై చర్చించారు. అమాపురం సబ్ ట్రెజరీ పరిధిలో ఇప్పటికే ఇంకా ఈకేవైసీ పూర్తి చేసుకోని సర్వీసు, ఫ్యామిలీ పెన్షనర్లు 1,380 మంది ఉన్నారని ట్రెజరీ అధికారి రంగారావు వివరించారు. వీరంతా డైరెక్టర్ ఆఫ్ ట్రెజరీస్ వారి మౌలిక ఆదేశాల మేరకు ఈ నెల 10వ తేదీ లోపు ఈకేవైసీ పూర్తి చేసుకోవాలని సూచించారు. పెన్షనర్లు వారి ఆండ్రాయిడ్ ఫోన్‌లో హెర్బ్ యాప్ డౌన్‌లోడ్ చేసుకుని ఈకేవైసీ స్వయంగా చేసుకోవచ్చన్నారు. లేదా ట్రెజరీ కార్యాలయానికి స్వయంగా వచ్చి చేసుకోవచ్చని పేర్కొన్నారు. ప్రతీ రోజు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల లోపు పెన్షనర్లు ట్రెజరీ కార్యాలయానికి వచ్చి ఈకేవైసీ ఉచిత సేవలు పొందవచ్చని రంగారావు సూచించారు. పెన్షనర్లు తమ వెంట పెన్షన్ పేమెంట్ ఆర్డర్ (పీపీవో), ఆధార్, బ్యాంక్ అకౌంట్ వివరాలు సీఎఫ్ఎంఎస్ నంబరు, ఆధార్ సీఎఫ్ఎంఎస్ లింక్డ్ సెల్‌ఫోన్ తీసుకుని రావాలని విజ్ఞప్తి చేశారు.

పార్క్‌లో క్రీడా సామగ్రి ఉంచాలి



శిథిలమైన జారుడుబల్ల

యానాం: అంబేడ్కర్‌నగర్‌లో కోట్లాది రూపాయల ఖర్చుతో నిర్మాణం చేసిన బుద్ధాపార్క్ నిర్వహణను మున్సిపల్ సిబ్బంది, పిడబ్ల్యూడీ సిబ్బంది పట్టించుకోవడం లేదని మంగళవారం స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా పార్క్‌లో చిన్నారులు ఆడుకునేందుకు ఏర్పాటు చేసిన క్రీడాసామగ్రి సైతం పూర్తిగా శిథిలమైపోయిందన్నారు. దీంతో చిన్నారులు ఆడుకునేందుకు వెళ్లి గాయపడటంతో నిరాశతో వెనుదిరుగుతున్నారన్నారు. తక్షణం అధికారులు స్పందించి నూతన క్రీడాసామగ్రిని ఉంచేవిధంగా చర్యలు తీసుకోవాలని పలువురు కోరారు. ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులతోనైనా పార్క్‌ను ఉన్నతంగా తీర్చి దిద్దాలని కోరుతున్నారు.

పసికందు వైద్యానికి రూ.50 వేల సాయం



పసికందు కుటుంబీకులకు రూ.50 వేల సాయం అందిస్తున్న ఎఫ్‌టీఎస్ ప్రతినిధులు

అమలాపురం టౌన్: నెల రోజుల పసికందు అనారోగ్యానికి గురై వైద్యానికి రూ.లక్షల్లో ఖర్చు అవుతున్న క్రమంలో ఆ పేద కుటుంబానికి అమలాపురం ఫ్రీ టైమ్ సర్వీస్ (ఎఫ్‌టీఎస్) ఫౌండేషన్ రూ.50 వేలు సాయంగా సమకూర్చింది. రాజమహేంద్రవరానికి చెందిన చాపల సునీంద్ర, దీపిక దంపతులకు గత నెల మగ బిడ్డ పుట్టాడు. బిడ్డ పుట్టకతోనే పలు ఆరోగ్య సమస్యలతో ఉండడంతో క్లిష్ట పరిస్థితుల్లో వైద్యులు అత్యవసర వైద్యం అందించారు. వైద్యానికి దాదాపు రూ.2 లక్షల ఖర్చు అవుతున్న క్రమంలో ఎఫ్‌టీఎస్ తన వాట్సాప్ గ్రూప్ ద్వారా దాతల నుంచి రూ.45 వేలు సేకరించింది. ఫౌండేషన్ రూ.5 వేలు సమకూర్చింది. మొత్తం రూ.50 వేల చెక్‌ను రాజమహేంద్రవరంలోలో పసికందు ఇంటికి ఎఫ్‌టీఎస్ ప్రతినిధులు తులా రాంబాబు, కాశిన ఫణీంద్ర, తులా సతీష్, అక్కిశెట్టి వెంకటేష్‌లు మంగళవారం వెళ్లి అందజేశారు. రాజమహేంద్రవరంలోని ఆ ప్రాంత పెద్ద బేతిరెడ్డి ఆదిత్య ఎఫ్‌టీఎస్‌ను అభినందించారు.

మెగా జాబ్‌మేళాతో 3,169 మందికి ఉపాధి

యానాం: పుదుచ్చేరి ప్రభుత్వం గత ఏడాది నుంచి నిర్వహించిన మెగా జాబ్‌మేళాల ద్వారా 3,169 మందికి ఉద్యోగాలు లభించాయని మంగళవారం అధికారులు ప్రకటించారు. పుదుచ్చేరిలో ఐటీ పార్క్‌ను నెలకొల్పడం కోసం దశలవారీగా చర్యలు తీసుకుంటున్నారని తద్వారా యానాం, మాహే, కారైకల్, పుదుచ్చేరిల్లోని నిరుద్యోగులకు ఉపాధి కలుగుతుందన్నారు. మొదటి దశలో 2వేల పోస్టులు భర్తీ చేస్తామన్నారు.

నష్టపరిహారం ఇవ్వాలి

అమలాపురం రూరల్: అకాల వర్షంతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కలెక్టర్ హిమాన్షు శుక్లాకు పార్లమెంట్ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి జీఎం హరీష్ బాలయోగి లేఖ రాశారు. ఎకరాకు రూ.25 వేల నష్టపరిహారం అందించేలా చూడాలన్నారు.

రైలు దహనం కేసు కొట్టివేయడంపై హర్షం

అల్లవరం: కాపు రిజర్వేషన్ కోసం తలపెట్టిన బహిరంగ సభలో సాంఘిక శక్తులు చొరబడి తునిలో రైలు దహనానికి పాల్పడిన కేసులో కాపు నాయకులపై పెట్టిన కేసును రైల్వే కోర్టు కొట్టివేయడంతో అల్లవరం కాపు నేతలు మంగళవారం హర్షం వ్యక్తం చేశారు. అల్లవరం సెంటర్లో రంగా విగ్రహం వద్ద సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఒకరికొకరు స్వీట్లు తినిపించుకున్నారు. కాపు జేఏసీ మండల కన్వీనర్ చిట్నీడి శ్రీనివాస్, మెరికల సుబ్బారాయుడు, కంకిపాటి సుబ్బారావు, వంగా నాయుడు, వీరబాబు, యాళ్ల సురేష్, దాసం శ్రీరామచంద్రమూర్తి, చిట్టి వెంకన్న, బండిగుప్తాపు పాండురంగ, మాకిరెడ్డి సత్తిబాబు పాల్గొన్నారు.

అమలాపురం టౌన్: తుని రైలు దహనం కేసును విజయవాడ రైల్వే కోర్టు కొట్టివేయడంపై అమలాపురం నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ కాపు నేతలు ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. వంటెద్దు వెంకన్నాయుడు, సూదా గణపతి, అడపా బాబులు, మద్దింశెట్టి ప్రసాద్ తదితరులు కోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతించారు. చంద్రబాబు కాపులపై కక్ష కట్టి కేసుల్లో ఇరికించారని ఆరోపించారు. చంద్రబాబు పాలనలో కాపులపై పెట్టిన అక్రమ కేసులన్నీ జగన్ ముఖ్యమంత్రిగా వచ్చాక ఆ కేసులను ఎత్తివేశారని గుర్తు చేశారు.



రంగా విగ్రహం వద్ద హర్షం వ్యక్తం చేస్తున్న కాపు నేతలు

న్యాయం గెలిచింది

ఉప్పలగుప్తం: 2016 సంవత్సరంలో జరిగిన చలో తుని కాపు ఉద్యమంలో రత్నాచల్ ఎక్స్‌ప్రెస్ దగ్ధమైన ఘటనలో నాటి టీడీపీ ప్రభుత్వం కాపు సామాజిక వర్గంపై కక్షపూరితమైన రాజకీయాలు చేసే ప్రయత్నం చేసినప్పటికీ న్యాయస్థానం న్యాయాన్ని గెలిపించిందని రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ చీకట్ల కిషోర్ అన్నారు. ఆయన నివాసంలో మంగళవారం విలేకర్లతో మాట్లాడుతూ 2014 ఎన్నికల్లో టీడీపీ ప్రభుత్వం కాపు రిజర్వేషన్‌లపై హామీ ఇచ్చినందుకే ఆరోజు కాపులు ముద్రగడ పద్మనాభం సమక్షంలో ఉద్యమం చేశారన్నారు. టీడీపీ ప్రభుత్వం కాపు యువతపై కేసులు పెట్టించినా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వాటిని ఎత్తివేసిందన్నారు.

మహిని అభినందించిన ఎస్పీ శ్రీధర్

పి.గన్నవరం: కె.ఏనుగుపల్లి గ్రామానికి చెందిన పర్యావరణ వేత్త, విద్యార్థిని అడబాల మహిని జిల్లా ఎస్పీ సుధీర్ మంగళవారం అభినందించారు. అమలాపురంలోని కార్యాలయంలో ఎస్పీని మహి కలిసింది. పర్యావరణ పరిరక్షణ, ఇంధన వనరులను పొదుపుగా వినియోగించడం, రహదారుల భద్రత, సైబర్ క్రైమ్, ఫ్రెండ్లీ పోలీసింగ్ వంటి అంశాలపై సామాజిక మాధ్యమాల ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకువస్తున్న మహిని ఎస్పీతో పాటు అడిషనల్ ఏఎస్పీ లతామధురి అభినందించారు. మహి ఇప్పటి వరకూ 200 దిశా యాప్‌లను కూడా ఇతరుల మొబైల్స్‌లో డౌన్‌లోడ్ చేయించింది.

ఘనంగా ఆదిలక్ష్మి అమ్మవారి జాతర



అమ్మవారిని దర్శించుకున్న భక్తులు

ముమ్మిడివరం: మండలంలోని గాడిలంక గ్రామ దేవత శ్రీ రాజరాజేశ్వరి(ఆదిలక్ష్మి)అమ్మవారి జాతర, తీర్థ మహోత్సవాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. మేళ తాళాలు, బాజాబజంత్రీలు, గరగ నృత్యాలు, కోయడ్యాన్స్‌ల నడుమ అమ్మవారి జాతర వైభవంగా నిర్వహించారు. అమ్మవారికి మొక్కుబడులు, నైవేద్యాలు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో భారీ అన్న సమారాధన నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. జెడ్పీటీసీ సభ్యుడు కుడిపూడి శివశంకరరావు, మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు మట్టపర్తి సత్యనారాయణ, ఆలయ కమిటీ చైర్మన్ గిరిగి సాయిరామ్, మహాదశ గంగాధరరామారావు, తోట చిన్నారావు, నల్లా వేణుగోపాలరావు పాల్గొన్నారు.

త్రయంబకేశ్వరస్వామి కల్యాణం

అమలాపురం రూరల్: బండారులంక గ్రామంలో భువనేశ్వరి సమేత త్రయంబకేశ్వర స్వామికి పంచ రాత్ర దివ్య కల్యాణ మహోత్సవం ఘనంగా జరిగింది. ఆలయ ట్రస్టీ పిచ్చిక వెంకన్న, ఇందిరాదేవి దంపతులు స్వామి సేవ నిర్వహించారు. కల్యాణ కర్తలు కామిశెట్టి కోటిలింగశర్మ విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఈ వేడుక జరిగింది. శ్రీశైలం మాజీ ట్రస్టీ చింతా శంకరమూర్తి చంద్రకళ దంపతులు స్వామివారికి, అమ్మవారికి నూతన వస్త్రాలు సమర్పించారు.